# రావిశాస్త్రి రచనల్లో రాజ్యాంగయంత్రం

(ఆ) కొలు ర/1982 — కె. బాలగోపాల్

రాజ్యాన్ని గురించి రాజ్యాంగ యంత్రాన్ని గురించి వకీళ్ళకు అర్థమయినంతగా మరెవ్వరికీ కాదేమో; వాటి గురించి అపోహలు గూడ వేరెవ్వరికయినా ఉండవచ్చునేమోగాని వకీళ్ళకుమాత్రం సహజంగా నయితే ఉండటానికి వీలులేదు. ('సహజంగా నయితే' ఎందుకంటే, వ్యవస్థను సంరక్షించే తన కర్తవ్యాన్ని నిర్వహిస్తూ రాజ్యాంగయంత్రం ఆ క్రమంలోనే వకీళ్ళ కడుపులూ బ్యాంక్ అక్కౌంట్ లూ గూడ పుష్టిగా నింపుతుంది కాబట్టి; అది వేరే విషయం)

స్కూళ్ళలోను కాలేజీల్లోను రాజకీయశాస్త్రమో పౌరశాస్త్రమో చదువుకునే దౌర్భాగ్యులకు, రాజ్యాంగయంత్రంలో మూడు భాగాలు ఉంటాయని, వాటిని న్యాయశాఖ, కార్యనిర్వాహకశాఖ, శాసనశాఖ, అంటారనీ నేర్పుతారు. ఆ దుర్భాగ్యం రావిశాస్త్రికి చిన్నతనంలో కలగలేదు కాబోలు, ఆయనకు ఆ మూడింటిలో మొదటి రెండే కనబడ్డాయి అందులోను రెండవదానిలో పోలీసులూ, 'వూరి ప్రెసిడెంటోడూ, ఎమ్మెల్యే మెంబరూ' మాత్రమే కనబడ్డారు. ఆ ప్రెసిడెంటోడు గూడ తన చీకటి రూపంలోనే గాని వెల్తురు రూపంలో - అంటే కార్యనిర్వాహకుడిగా - కనబడ్డాడు కాదు వృత్తిరీత్యా రాజ్యాన్ని రాజ్యాంగ యంత్రాన్ని 'క్రిమినల్' కళ్ళతో చూడడం రావిశాస్త్రికి సహజం అయితే కావచ్చు గాని, ఆ దృష్టి చాలా పాక్షికం. వర్గసమాజంలో అన్యాయం చీకటి వ్యవహారం కాదు, వెల్తురు వ్యవహారమే. ప్రెసిడెంటోడు చేసే ప్రెసిడెంటేతర చీకటి పనులలో కాదు. వెల్తురులో చేసే ప్రెసిడెంటు పన్లలోనే వ్యవస్థ దుర్మార్గమంతా వుంది. దాసరి బోడిగాడిమంది తీసుకున్న దొంగ తనఖాలో కాదు, సర్కారువారి భూమి తనఖా బ్యాంకులతోనే వుంది

పాక్షికమయితే కావచ్చుగాని, రావిశాస్త్రి దృష్టి ప్రసరించినంతమేరకు చాలా నిశితమయినది, ఇసుకరేణువులను సహితం వేరుచేయగల సత్తాగలది. నేరానికీ రాజ్యాంగ యంత్రానికీ మధ్యవున్న సంక్లిష్టమయిన పరస్పరతను అణువణువూ కణంకణమూ వివేచించి అడ్డుకోతపటాలూ నిలువుకోతపటాలూ మాత్రమే తక్కువగా వివరించగలది.

ఈ పరస్పరత రెండురకాల అమాయకులకూ అర్థం కాదు. అమాయకులయిన అమాయకులు (వీళ్ళు మొదటిరకం), నేరాన్ని అరికట్టడం, నిరోధించడం, రాజ్యాంగయంత్రం పని అనుకుంటారు. ఈ కోవకు చెందిన వాళ్ళు బడికంతుళ్ళు కుర్ర ఐ. ఏ. ఎస్. ఆఫీసర్లు. రెండవరకంది దుస్సాహసిక అమాయకత్వం రాజ్యాంగయంత్రం నేరాన్నసలు అరికట్టనే అరికట్టదని, నేరం మీద బలపడమే ప్రభుత్వ 'కార్యనిర్వాహకుల' పని అని అనుకుంటుంది. ఈ కోవకు చెందినవాళ్ళు సాధారణంగా కవిత్వం రాస్తారు.

అసలు సంబంధం ఇదీకాదు, అదీకాదు. బూర్జువా రాజ్యాంగ యంత్రం నేరాన్ని సంపూర్ణంగానూ అరికట్టదు (అది దానికి అవసరమూ కాదు, శ్రేయస్కరమూ కాదు), అలాగని నేరాన్ని పనిగట్టుకుని పోషించనూ పోషించదు అది నేరాన్ని రెగ్యులేట్ చేస్తుంది. రావి శాస్త్రి మాటల్లో ('తలుపుగొళ్ళెం'), భూమ్మీద మనిషికి ముఖ్యమయిన పనుల్లో

మొదటిది : దొంగతనం చేయడం

రెండవది : దొంగల్ని పట్టుకు శిక్షించడం

భూమ్మీద ఎల్లకాలం కాకపోయినా – పెట్టుబడిదారీ సమాజంలో, మొదటిదీ రెండవదీ కాకపోయినా అతి ముఖ్యమయిన పనుల్లో, ఈ రెండూ లెక్కకు వస్తాయి. ఎందుకంటే పెట్టుబడిదారీ వ్యవస్థ అందరికీ పని ఇవ్వలేదు; ఇవ్వడం దానివల్లకాదు, కాకుండా ఇస్తే నిరుద్యోగ భయంపోయి కార్మికులు పట్టపగ్గాలు లేకుండా పోతారు. అయితే దేశంలో నిరుద్యోగులు మరీ ఎక్కువయిపోయినా ప్రమాదమే. నిరుద్యోగులంతగా అరాచకత్వానికి సహితం వెనకాడకుండ తిరగబడే వాళ్ళుందరు. కాబట్టి, తాను ఉత్పత్తిదాయకమయిన పని (Productive work) చూపలేని వాళ్ళలో కొందరికి (కొందరికే) నేరాన్ని ఒక మార్గంగా చూపుతుంది బూర్జువా సమాజం. అమెరికాలో ఇవ్వాళ 10 శాతం నిరుద్యోగ ముందట. అక్కడ నేరమే లేకుంటే అది 25 శాతానికి (కనీసం) పెరుగుతుంది ఆట్లా పెరిగితే చాలా ఇబ్బంది. అందుకే 'దొంగతనం చేయడం' అవసరం. అంతేకాకుండ, సోషలిస్టు భావాలు బాగా ప్రచారమయిపోయిన ఈ రోజుల్లో చట్టబద్ధమయిన వ్యాపారంలో గడించే లాభానికి కొన్ని పరిమితులుంటాయి. తాతా బిర్లాలు తమ పెట్టుబడి మీద

10-15 శాతం లాభం పొందుతున్నమాట, వాస్తవమేగాని అంతకుమించితే పార్లమెంటులోని కమ్యూనిస్టు నాయకులు గొడవ పెడతారు చచ్చి మార్క్సిస్టు స్వర్గాన వున్న జ్యోతిర్మయబసు వంటి వికార్పుగాళ్ళు మొనోపొలీ కమిషన్లలోను పార్లమెంటరీ కమిటీలలోను చేరి వర్గపోరాటం ప్రకటిస్తారు అందుకని - దొంగసారానుండి దొంగ సిమెంటు వరకు - రకరకాల దొంగవ్యాపారాలు అవసరం అందుకోసం కూడ 'దొంగపని చేయడం' అవసరం అయితే ఈ దొంగపన్లు మితిమీరిపోతే అసలుకే మోసం వస్తుంది నేరాన్ని అరికట్టకపోయినా కనీసం అదుపులో వుంచుకోలేని ప్రభుత్వాన్ని ఏ ప్రజలూ గౌరవించరు. దానికి 'లెజిటిమెసీ' పోతుంది. అప్పుడు కొంపలంటుకపోతాయి. అందుకే 'దొంగల్ని పట్టుకు శిక్షించడం' అవసరం.

సూక్ష్మీకరించి చెప్పాలంటే, నేరం బూర్జువా సమాజపు సంక్షోభాలకు ఒక సేఫ్టీవాల్వులాంటిది. అవసరమయినప్పుడు దాన్ని తెరవకపోతే ఒత్తిడికి తట్టుకోలేక ఇంజను పగిలిపోతుంది. అలాగని సేఫ్టీవాల్వుని ఎప్పుడూ తెరిచి వుంచితే ఇంజను అసలుపని చేయదు. అంటే దాన్ని రెగ్యులేట్ చేయాలి, అదుపులో వుంచుకోవాలి. సరిగ్గా అదే (నేరానికి సంబంధించి) రాజ్యాంగ యంత్రం కర్తవ్యం. ఆ సేఫ్టీ వాల్వును తెరవడంలోను, బంద్ చేయడంలోను 'కార్య నిర్వాహక శాఖ' అని పిలవబడే పోలీసులు పనిలో పనిగా తమ చేతులు తడుపుకుంటారు తమకు పైసలీయగల బడా దొంగలను వదిలిపెట్టి చిన్నదొంగలను పట్టుకొని (న్యాయంగానో అన్యాయంగానో) శిక్షిస్తారు. (అంతేగాని వాళ్ళ చేయి తడుపుడుకోసమే నేరం ఉందనుకోవడం అమాయకమయిన పొరబాటు).

దీనంతటి అర్థం, రాజ్యాంగ యంత్రం నేరాలలో ఏ 20 శాతాన్నో పరిష్కరిస్తుందనీ. నేరస్తులలో ఏ 20 శాతాన్నో శిక్షిస్తుందనీ ఎంతమాత్రం కాదుకి నేరం కంట్రోల్‌లో వుండడం, రాజ్యాంగయంత్రం దాన్ని కంట్రోల్‌లో వుంచుతున్నట్లు జనానికి కనిపించడం, అసలు విషయాలు. దానికి నేరాలను పరిష్కరించాల్సిన అవసరంగాని, నిజమయిన నేరస్తులను నిజమయిన నేరాలకు శిక్షించాల్సిన అవసరంగాని, ఎంతమాత్రం లేవు. అప్పుడప్పుడు కంపెనీలనూ సారాకొట్లనూ 'రెయిడ్' చేస్తూంటే చాలు (ముందుగా కబురు పంపించి చేసినాసరే). ఆపేల్లి. ఎక్కడి దొంగలు అక్కడ గప్‌చుప్. అదొక మార్గం. గంగిరెద్దు ('రత్తాలు-

రాంబాబు'లో) తన శిష్యుడికి చెప్పే కథలో రెండవమార్గం వుంది. 'కలెక్టరుగారి పియ్యే పెళ్ళానివి' ఆరుతులాల గొలుసు, నాలుగు తులాల గాజులు, పొయ్యాయట పెద్దవాళ్ళ ఇంట చోరీ గొడవకు దారితీస్తుంది కాబట్టి ఏదో చేసినట్టు కనిపించాలి ఎస్సై 'పనివాడితనం' మీద కాక 'రికమెండేషన్' మీద పైకొచ్చిన ఉంత కావడాన ఆ బాధ్యత గంగరాజెడ్డుమీద పడింది. 'ఏదో చెయ్యాలి' గాని నేరస్తుణ్ని పట్టుకోవాలన్న నిర్బంధం లేదని ఎరిగిన సదరు హెడ్డు పాళ్ళోని ఖైదీల లిస్టు తిరగేసి ఒకానొక ఖైదీని 'పావుతులం బంగారం ఇస్తాను కేసొప్పుకుంటావా?' అని అడుగుతాడు తులానికి తొందరయి కేసులొప్పుకోగల ఆ ఖైదీ దానికి సై అంటాడు. అప్పుడు ఊళ్ళోని పెద్దబంగారం కొట్టు యజమాని ఆ దొంగబంగారం కొన్నట్టు, అతనికి ఈ ఖైదీ దాన్ని అమ్మినట్టు, కేసు పెట్టించి పన్నెండు తులాల బంగారం రికవర్ చేసి అందులో పదితులాలు 'కలెక్టరుగారి పియ్యే పెళ్ళానికి', పావుతులం కేసొప్పుకొని జెయిలుకు పోయిన ఖైదీకి, మిగతాది మిగతావారికి ఇప్పిస్తాడు గంగరాజెడ్డు. జరిగిన నేరానికి శిక్షింపబడ్డవారికి దొరికిన బంగారానికి ఏ సంబంధం లేదు, ఉండాల్సిన అవసరంలేదు. అసలు బంగారం దొరికిన తరువాత అందులో కొంత ఇంకో కేసులోకి, 'మిగతాది మిగతా చోట్లకి' వెళ్ళిందట (వివరాలు అడగడం పెద్దమనుషుల లక్షణం కాదు గనక అడగొద్దు). ఇక్కడే మరొక కిటుకుంది. అదేమిటంటే కేవలం చిన్నవాళ్ళనే కాకుండ అడపాదడపా పెద్దవాళ్ళను గూడ శిక్షించడం గంగరాజెడ్డు మాటల్లో, 'పెద్దోళ్ళకి అప్పుడప్పుడు మనం అలా జుల్మానా లేస్తుంటేగాని జాతి ముందలికి నడవదు'. పైగా, పెద్దోళ్ళకలా అప్పుడప్పుడు సురకలు తగిలించడాన్నే సోషలిజం అంటారు చదుంకున్నోళ్ళు.

మూడవ మార్గం మరీ పెద్ద మనిషి తరహాది. ఇక్కడ రెయిడుల్లాంటి 'అధార్టీ' చెలాయించడం గాని, తప్పుడు కేసుల కిందనేరం చేయని వాళ్ళను శిక్షించడం గాని, వుండదు. అధోప్రపంచానికి కొన్ని నియమాల్ని ఏర్పరచి ఆ కట్టుదిట్టాలను ఎవ్వరూ ఉల్లంఘించకుండా చూడడం ఈ పద్ధతి. ఒక చక్కటి ఉదాహరణ సారాకథ 'పాపి', రామదాసు, నీలయ్య, ఘరానా సారావ్యాపారస్తులు, ఒకరి కొకరు పోటీదారులు. అయినా ఈ మొనోపొలీ రోజులలో పెట్టుబడిదార్లు పోటీపడకుండ జాగీర్లు పంచుకోవడం అలవర్చుకున్నారు గనక దాసు, నీలయ్యలుగూడ ఒకరు పూర్వం తూర్పు ప్రాంతాన్ని ఒకరు పడమటి ప్రాంతాన్ని పంచుకున్నారట. 'అనాటీషరతు

లకు కట్టుబడే రక్షకశాఖవారు గూడ శాంతిభద్రతలు కాపాడుకుంటూ వస్తున్నా' రట. ఫలితంగా, 'ప్రాతఃకాలంలో, సాయంసంధ్యలో, నిశిలో, సారా 'మోటారు ట్యూబుల్లో' ప్రవహిస్తోందట. 'మూడుబుడ్లూ ఆరు గ్లాసులుగా' సారాప్రపంచమంతా శాంతి సామరస్యాలతో వర్ధిల్లుతోందట. ('కార్యనిర్వాహక శాఖ' కు ఎంతమాత్రం ముట్టిందో పెద్దగా చెప్పుకోవడం పెద్దమనుష్యుల లక్షణంకాదుగనక రావిశాస్త్రి మనకు చెప్పడుగాని. తగుమాత్రం ముట్టే వుంటుంది) ఈ ప్రవాహమే లేకుంటే ఆ బళ్ళ వాళ్ళు, ఆ సైకిళ్ళవాళ్ళు, ఆ ట్యూబులు. మోపేవాళ్లూ ఆకార్లు తోలేవాళ్లూ ఏమయి పోవాలి ? ఈ దౌర్భాగ్యపు అర్ధవలస దేశం వాళ్ళకు ఉద్యోగాలెక్కడి నుండి చూసి పెడుతుంది ? ఆ సారావ్యాపారంలోని పెట్టుబడి అంతంత లాభాలు మరెక్కడ సంపాదించుకోవాలి ? అగ్గిపెట్టెలూ సబ్బుబిళ్ళలూ తయారుచేస్తే వస్తుందా ?

అయితే ఒకనాడు తగువొచ్చింది దాసు జాగీర్లోకి నీలయ్య ప్రవేశించగా నీలయ్యకు దాసు 'క్విట్' నోటీసు ఇచ్చాడు నీలయ్య వినుకున్నాడుకాదు. కొద్ది కొద్దిగా అగ్గి రాజుకోవడం చూసి ఇన్‌స్పెక్టర్ రంగంలోకి దిగి నీలయ్యను 'వాడి జాగాలో నువ్వెందుకు ?' అని చీవాట్లు పెడ్తాడు అంతా తన మంచికే అని ఎరిగిన లోకజ్ఞుడు నీలయ్య పైకి మాత్రం 'సారా అమ్ముకునే దొంగముండ కొడుకులం దొంల్ని ఏంచేయగలం ?' అని నిష్ఠూరాలు పలికి తొలగిపోతాడు. తొలగయితే పోతాడుగాని దాసుమీద కోపం పెంచుకుంటాడు. 'కార్యనిర్వాహకశాఖ' కు ఎన్ని పైసలిస్తాడోగాని వాళ్ళు దాసు రిక్షాలను, రిక్షాలోని ట్యూబులను, ట్యూబుల్లోని సారాను, చేజిక్కించుకొని రిక్షాలు మూడింటిని 'గవర్నమెంటుకు కలిపేసు'కున్నారట. ఆటు పిమ్మట దాసు తన ప్లీడరుకు 'ఒందరూపాయలకాగితం' దగ్గరుంచుకొని 'అయదారాబాదెళ్ళైనా సరే రిక్షాలు ఇడిపించ'మని పురమాయించి తాను మాత్రం గుట్టు చప్పుడవకుండ 'పరమేశ్వరుని లీలా మాహాత్మ్యం' సాయంతో నీలయ్యను చంపేస్తాడు. దాసునుగాని ఎవరినిగాని పోలీసులు అరెస్టుచేసి వుండరని ఊహించవచ్చు. గుట్టుచప్పుడుకాకుండడం ముఖ్యం చప్పుడయితేనే చట్టమూ శిక్ష అనే సేఫ్టీ వాల్వులను తెరవాల్సి వుంటుంది కావంత వరకు అంతా సాఫ్‌సీదాయే

వేరానికి బూర్జువా రాజ్యాంగ యంత్రానికి వున్న ఈ పరస్పరతలో ప్లీడర్లూ మేజిస్ట్రేటులూ భాగం పంచుకుంటే సరేగాని, లేకపోతే అది వాళ్ళనుగూడ బొమ్మల్ని చేసి ఆడిస్తుంది. కుర్రప్లీడరు మూర్తి('మాయ'లో) అందరు కుర్రవాళ్ళ

లాగే అమాయకుడు. ఒకనాడు అతని దగ్గరికి ఒక 'గెద్ద' లాంటి బ్రోకరు ('జామీను మనిషి') ముత్తెంమ్మ అనే ఒక ఆడమనిషిని తెస్తాడు. సారావ్యాపారంలో ఒకనాడు బతికిచెడి ఇప్పుడు 'సారా తప్ప పొణ్ణం ముట్టని' మొగుడ్ని తిండిలేని ఇద్దరు పిల్లల్నీ పోషిస్తూ, తమ్మూ తన సంసారాన్నీ అమ్మేసినా వందరూపాయలు గిట్టని అర్భకురాలు ముత్తెంమ్మ. అయినా ఆమెలో చేవచావలేదు. అమ్మకపు సరుకుల సమాజపు వ్యాపారనీతిలేదంటుంది. 'నదువుకున్నోడివి నీకూలేదు, నదువుల్లేనోణ్ణి నాకూలేదు' అంటుంది. చిన్నకూతురు- పోలీసులు చెప్పకుండా ఎప్పుడయినా రెయిడుకువస్తే 'కుక్కలొస్తున్నాయ'ని అమ్మకు వార్నింగిచ్చేపిల్ల - ఒక నిజమయిన పిచ్చికుక్క కరవగా చనిపోయిన దుఃఖంలో పోలీసోళ్ళకు మామూలివ్వలేదని హెడ్డు తన మీద సారాకేసుపెట్టేడంటుంది హృదయవిదారకమయిన ఆమె కథకు చలించిపోయి ఫీజువందమంది పాతిక్కుదించి ఆమెకేసు చేస్తాడు మూర్తి తన ప్రావీణ్యమంతా ఉపయోగించి హెడ్డు చేత పప్పులో కాలేయించాననుకుంటాడు, సంతోషిస్తాడు 'హెడ్డుబాబుసాచ్చికం' తేలిపోయిన కారణంగా కేసుకొట్టేయబడుతుంది అయితే పాపం అతని సంబరానికి చిల్లుపొడుస్తూ ముత్తెలమ్మ అసలు విషయం చెబుతుంది- తాను 'కట్నం సదివిచ్చుకొని తేఁగొట్టేయించింద'ని. పైగా ఇలాంటి రివాజు కేసుల్లో ఏ ప్లీడరూ వాళ్ళను పప్పులో కాలేయించలేదని, అన్నీ ఏ విధంగా పకడ్బందీగా సాగిపోతాయో వివరిస్తూ మరొక చిన్న లెక్చరిస్తుంది. అంతాచెప్పి, పూర్తిగా నీరుగారిపోయిన మూర్తిమీద మళ్ళీ జాలివేసి "నువ్వుగూడ బాగానే ఆడిగావులె"మ్మని సర్టిఫికేటిస్తుంది మూర్తికి 'అంతా అసందర్భంగాను, కనుకట్టుకట్టినట్టుగాను, మాయగాను' తోచిందట. 'సారా' అసలు దొరకలేదు. దొరికిందని కేసుపెట్టారు దొరకలేదని తిరిగితేలగొట్టేసారు.... జరిగిందని చెప్పబడ్డ జరగని విషయం జరగలేదన్నారు' అని విస్మయం చెందుతాడు. అంతామాయే. కాని 'ఆ మాయ మధ్య ఎంతబాధ!' అనిగూడ అనుకున్నాడట. అయినా మూర్తి బహుశా సర్దుకుపోయి సగటు ప్లీడరులాగా తానూ ఆ మాయలో భాగస్వామి అయిపోతాడనిపిస్తుంది.

ఆటా సర్దుకుపోయే మరొకడు 'న్యాయం'లో మేజిస్ట్రేటు నేరాన్ని పకడ్బందీగా నియంత్రించే రాజ్యాంగ యంత్రపు వాస్తవకర్తవ్యానికి 'న్యాయం' అనే నకిలీ ముసుగు తగిలించడంవల్ల ఒక కొత్త నకిలీ పరిభాష ఏర్పడుతుంది వాస్తవానికీ ఆ ముసుగుకూ మధ్య ఎంత ఎడంవుందో ఆ పరిభాషకూ దాని తాత్ప

ర్యానికి గూడ అంత ఎడం వుంది. ఆ పరిభాషలో 'కేసు ఒప్పేసుకోవడం' వేరు, నేరం చేసినట్టు అంగీకరించడం వేరు. మేజిస్ట్రేట్ ముందుకు ఒక 'పతిత'నతెస్తారు. ఆమె పతితే గాని కథల్లో పతితలాగా లేదట. చూస్తే కడుపులో వికారం పుట్టించే ఒట్టుందట. ఆమె 'నూకరాజుకంపెని'లో వుంటుందట. అదెట్లాంటి కంపెనీయో తెలియని 'పావనం ముండాకొడుక' యిన మేజిస్ట్రేటు ఆమెను ఏం పనిచేస్తావని అడుగుతాడు. గత్యంతరంలెక 'హెడ్డు' వివరిస్తాడు.

ఒక 'గేలం' వంటసారా ఆమె దగ్గర దొరికిందని ఆమెమీదకేసు. 'మదరాస్ ప్రొహిబిషన్ అక్ట్ సెకన్ 4(1) ఎ' క్రింద కేసుపెట్టారు. ఆఖారీసెక్షన్ క్రింద పెట్టబడ్డకేసులో 'నేరంచేసావా ?' అని అడుగుతాడు మేజిస్ట్రేటు ఆమెను.

'కేసునొప్పేసుకుంటానండి' అందామె

'అంటే, నేరం చేసేననంటావా ?'

'కేసు కొప్పేసుకుంటానండి'

'నేరం చేసావా ?'

'కేసుకొప్పేసుకుంటాను బాబుగారు'

'అంటే నేరం చేసేననంటావా ?'

'నేనేం నేరం చెయ్యలేదండి'

'అయితే కేసుకొప్పుకుంటానని ఎందుకంటున్నావు ?'

'కేసు కొప్పేసుకుంటానండి'.

కేసుకొప్పేసుకోవడంవేరు, నేరం చేయడం వేరు. మొదటిది, రాజ్యాంగ యంత్రం అధోప్రపంచాన్ని నియంత్రించే కార్యక్రమంలో అప్పుడప్పుడు పేదల పాలిట అవసరమయ్యే ఎత్తుగడ. రెండవది వేరు, అది నీతికి నిజానికి సంబంధించిన విషయం. ఈ నకిలీ న్యాయపు నకిలీ పరిభాషకూ దాని తాత్పర్యానికీ ఉన్న ఎడం మొదట్లో అర్థం కాక, ఆ ఒక్క కేసుతోనే గంటలు గడుపుతాడు మేజిస్ట్రేటు. 'నేరం చెయ్యలేదట, కేసు ఒప్పేసుకుంటుందట' అని తికమకపడి తనకిన్నిసమస్యలు ఎవరెవరో కుట్రలుపన్ని తెచ్చిపెడుతున్నారని తిట్టుకుని 'ఏదీ ఎవ్వరూ సాక్షిగా

సవ్యంగా నడవ నివ్వరు' అని విసుక్కుంటారు. ముద్దాయి ఏడిస్తే ఆమెది దొంగఏడుపని తీర్మానించిన లోకజ్ఞులు ఇన్‌స్పెక్టరు, హెడ్డు, ఆమెను తిడతారు. జాలిపడి మేజిస్ట్రేటు 'ఆవిణ్నేం భయపెట్టకండి' అని విసుక్కుంటాడు. కాని కాసే పయ్యాక ఆమెగూడా 'మనలాటి మనిషేనా !' అని ఆశ్చర్యపోతాడు. ఎటూపాలు పోక పోలీసులవైపు తిరిగి సిగ్గుసిగ్గుగా 'ఆ కంపెనీలు- మీరు చెప్పినవి- ఎందుకు ఎత్తించేయరూ ?' అని అమాయకంగా అడుగుతాడు 'ఎత్తించేస్తున్నాం సార్ ! ఎత్తించేస్తె వీళ్ళు రోడ్లు కాపేస్తున్నారు సార్ !' అని తమ అసహాయత తెలియ బరుస్తాడు ఇన్‌స్పెక్టరు "ఏ బతుకు బతికే వాళ్ళు ఆబతుకు బతకాలి కదా బాబు గారూ" అని తత్వం చెబుతాడు ఫిలాసఫర్ అయిన హెడ్డు ఆ తత్వంలోనే అసలు సత్యం వుంది ఇలాంటి రకరకాల బ్రతుకులు లేందే ఈ సమాజం నడవదు- ఎటొచ్చీ ఆ బతుకులు మరీ బరితెగించేస్తే, తమకు మరీ "టెరిబుల్ న్యూసెన్సు"గా తయారయితే, పై పెచ్చు ఆడిక్కుమాలిన న్యూసెన్సుగాళ్ళు లంచాలిచ్చుకోలేని వాళ్ళయితే, ఈముద్దాయిలాగా వేశ్యాజీవితపు బాధభరించలేక తాగిరోడ్డు మీద పడిపోతే, అప్పుడు హెడ్డూ, ఇన్‌స్పెక్టరూ రాకా తప్పదు, దొంగకేసు ("గేంసారా" దొరికిన కేసు) పెట్టకా తప్పదు.

ఇదంతా మేజిస్ట్రేటుకు అర్థం అయినా కాకున్నా తనపని ఒత్తిడి అతన్ని సర్దుకుపోయేలా చేస్తుంది. 'నీ కోర్టులో నెలకి ఎన్నికేసులు? కనీసం అయిదువందలు. కొండ కొండా చొప్పున అయిదు వందల కొండలు తవ్వాలంటే తవ్వు, దానికి నీకు శక్తుంటే ఉండొచ్చు, కాని టైముందా? ఆలోచించు' అని అనుభవజ్ఞుడయిన పెద్ద మనిషి ఒకాయన ఇచ్చిన సందేశం గుర్తుకొచ్చి, ముద్దాయికి 'ఒకనెల' వేస్తాడు. ఆటుపిమ్మట 'మిగతా కేసులన్నీ చకచక పిలవ నారంభించే'డట. దాంతో ఆయన గారి 'చాదస్తాని'కి ఫుల్‌స్టాపే.

అయితే పాపం అందరు మేజిస్ట్రేటులూ అట్లా సర్దుకుపోలేరు (కనీసం రావిశాస్త్రి కథల్లో). రాజ్యాంగ యంత్రం తగిలించుకునే ఈ న్యాయమనే దొంగ ముసుగుకూ దాని వాస్తవ కర్తవ్యానికీ మధ్యవున్న ఎడం తనలో తన మానవాంశకూ వృత్తిజీవికీ మధ్య సృష్టించిన అంతరంవల్ల స్కిజోఫ్రెనిక్‌గా మారి 'మెంటల్' కేసవుతాడు, "మోక్షం"లో మేజిస్ట్రేటురావుగారు. ఈయన మంచివాడని మనకు కనిపించదు, ఎందుకంటే కథ మొదలయ్యేసరికే కొంచెం పిచ్చివాడయిపోయి అమాను

షంగామ యంత్రమంత కఠినంగాను కవిపిస్తాడు కాని ఒకప్పుడు వకీలు మూర్తి అంత అమాయకంగాను, "న్యాయం" లో మేజిస్ట్రేటంత దాదస్తంగాను వుండి వుంటాడు. కృత్రిమ జీవితాన్ని - అందులోనూ అమానుషమయిన కృత్రిమత్వాన్ని - భరించలేక పిచ్చిగాను కఠినంగాను గూడ అయిపోయి వుంటాడు. షరీ పాము వరకమూ చీటీ కోర్టూ ముద్దాయిలూ అంతా కలగాపులగమయిపోయి, పాముల్లాంటి సారాట్యూబులూ, ఇరవయి సంవత్సరాలలో ఏడాదికి అరువేల కేసుల చొ॥న ముగించిన వేలాది కేసులలోని ముద్దాయిలూ, అయనకు కలలోకి వస్తారు ప్రతిరోజూ సారాకేసులే, దాదాపుగా అన్నికేసులూ సారాకేసులే అందరు ముద్దాయిలూ జెయిలుకే "కూలీలు జెయిలుకి, కుష్టురోగులు జెయిలుకి, అమాయకులు జెయిలుకి, దరిద్రులు జెయిలుకి, ఆడవాళ్ళు, అనాధలు, అందరూ జెయిలుకి...." 'అర్ధరూపాయి కూల్డబ్బులిచ్చి మొయ్యమన్న' షావుకారుకు కాదు, సారాట్యూబు మోసిన "కాళ్ళ నిండా బురద బురద, వంటినిండా బుగ్గి బుగ్గి, కోకనిండా దాగులు దాగుల, తలనిండా పేలు పేలు, కళ్ళనిండా జడుపు జడుపు" వున్న స్త్రీకి జెయిలు. వీళ్ళంతా కటకటాల వెనక కుళ్ళి కుళ్ళి వుంటారు, తనమీద పగబట్టి వుంటారు, అనుకుంటాడు. అనుకుని పిచ్చివాడయిపోతాడు తన చేతులు త్రాచుగాను. వీళ్ళంతా ఆ త్రాచును చంపే పగబట్టిన చలిచీమలగాను కనబడతారు. సిరాలో విషం, కలంలో కాటు కనిపిస్తాయి. పోలీసులకు డబ్బులిచ్చిన షావుకారుకు "బదలా" తాను కేసొప్పుకున్న షావుకారు భృత్యుడికి పిచ్చెక్కిన కోపంలో జరిమానా కడ్తానన్నా వినకుండ జెయిలు శిక్ష వేస్తాడు. చివరికి విచారించకుండానే కొందరికి శిక్షవేస్తాడు బెంచి గుమాస్తాకూ "అర్నెల్లు" వేస్తాడు. ఈతచెట్లకూ తాడిచెట్లకూ వేస్తాడు. వేసి తాను పిచ్చాస్పత్రికి పోతాడు.

మేజిస్ట్రేటులూ వకీళ్ళూ ఈ అబద్ధపు కంపులో సామరస్యమయినా సాధించాలి. పిచ్చివాళ్ళయినా కావాలి. కాని ఈ 'సేఫ్టీవాల్వు' మరల్లో చిక్కుకున్న పేదలకు మాత్రం "సామరస్యం" ఒక మార్గంకాదు, ఆ దౌర్జన్యాన్ని అనుభవించడమే వీళ్ళకు మార్గం. అందుకే వాళ్ళకు కోర్టులంటే భయం, అసహ్యం. పేదవాళ్ళు రోగానికంటే ఆస్పత్రులకు ఎక్కువ భయపడ్డట్టు నేరానికంటె కోర్టులకు ఎక్కువ భయపడతారు కళ్ళు లేకకాదు, ఉండీ మూడదల్చుకోని బూర్జువా చట్టానికి అన్యాయం కనిపడదు. చట్టాల అతిక్రమణ మాత్రమే కనబడుతుంది, అన్యాయం Cognisable offence కాదు, దాని మీద ప్రతీకారమే Cognisable offence. దాని కళ్ళకు

కాంట్రాక్టు కనబడుతుందే గాని, ఆ కాంట్రాక్టు వెనకున్న మోసాలు కనబడవు. కాంట్రాక్టును అతిక్రమిస్తే పట్టించుకుంటుంది గాని ఆ కాంట్రాక్టే మానవత్వాన్ని అతిక్రమిస్తే దానికి పట్టదు దాసరి బోడికి వాళ్ళ ఊరి ప్రెసిడెంటు '(సొమ్ములు పోవాయండి) జత పోతుల కొనడానికి నెలకు వందకు పాతిక చొప్పున వడ్డీకి (ఊరి కరణం సాక్షిగా) మూడు వందలు అప్పిచ్చి ఆరువందలకు ప్రోనోటు రాయించు కొని, పోతుల్ని తాను తోలుకుపోయి, ఇచ్చిన వడ్డీ దిగమింగి, మళ్ళీ ప్రోనోటు ప్రకారం ఆరువందలూ చెల్లించమని డిమాండుచేస్తే, ఇదే చట్టానికి కనిపించలేదు గాని, ప్రెసిడెంటు అన్న కొడుకు తన భార్యను అవమానపరిచాడని వాడిమీద చెయ్యి జేసుకున్న బోడిని ఆర్నెల్లు జైలుకు పంపింది. ప్రోనోటును 'ఆనర్' చెయ్యలేని అతని ఆస్తిని జప్తు చేసింది. ఆ ప్రెసిడెంటు బోడిని లొంగదీసుకునేందుకు చట్టాన్ని వాడుకునే తీరు లోకంలో రివాజే గాని తెలుగు సాహిత్యంలో అపూర్వము యింది. మొట్ట మొదట అతని ఆస్తిని (ఒక ఎకరా నలభై సెంట్ల బృహత్ జాగీరు) జప్తు చేయిస్తాడు-తనకు రాసియిచ్చిన ప్రోనోటును "ఆనర్" చేయడేమోనన్నభయం వ్యక్తపరచి, తన అన్న కొడుకును కొట్టాడని ఫిర్యాదిచ్చి బోడిగాడి కుటుంబం మీద ఏకంగా అరెస్టు వారంట్లు రాయిస్తాడు మేజిస్ట్రేటు చేత. తాలూకా వేరే కాబట్టి తాము తెచ్చిన ఆస్తిసర్టిఫికేటు చెల్లదని మతిలేని చట్టం ప్రకటిస్తే. కోర్టున్న తాలూకా తాసీల్దారెవరికి పరిగెతే ఓపికలేక, వృత్తి జామీన్‌దార్లకు డబ్బులిచ్చుకొని బయట పడ తారు బోడి, అతని భార్యా, కూతురూ వాయిదా వాయిదాకుకోర్టుచుట్టూ తిరగలేక సత మత మవుతూన్న బోడిమీద, అతని బామ్మర్దిమీద వాళ్ళవల్ల తనకు ప్రాణాపాయ ముందని 'బైండోవర్' కేసు పెడతాడు ప్రెసిడెంటు. దానికోసం కలెక్టరు కాంపెళ్ళిన వూరల్లా వెళ్ళాల్సి వస్తుంది బోడికి, అతని సహచరులకూ. అట్లా తిరగటంలో బోడి కూతురి రౌడీల పాలబడి చచ్చిపోతుంది డబ్బుకోసం జగిలీడుకు నలభై సెంట్లభూమి 'ప్రోనోటు రయ్యచ్చేయ'గా, జగిలీడు దగ్గర ఆ ప్రోనోటును 'ట్రాన్స్ఫర్' చేయిం చుకుని, ఆ నలభై సెంట్లభూమి తనకు అమ్మకపోతే దావా వేస్తానని నోటీసిప్పిస్తాడు ప్రెసిడెంటు జగిలీడు మాత్రం ఏంచేస్తాడు ? కూతురి పెండ్లికి అతనికి డబ్బు అవ సరం. సాటి పేదవైతని బోడికి ఆసరాగ నిలబడ్డాడేగాని, అది తన పేదరికం పరిధి లోనే చివరికంటా బామ్మర్దిలాగా నిలబడడం అందరికీ సాధ్యంకాదు

ఇంతలో ప్రెసిడెంటు అన్న కొడుకును కొట్టిన కేసులో బోడికి ఆర్నెల్లు శిక్ష ; వెనకనే 'ప్రోనోటుకేసు' గూడ ఓడిపోతాడు, భూమి డిక్రీ అయిపోతుంది.

గత్యంతరం లేక రాజీకి వస్తాడు బోడి. నలభై సెంట్ల పొలం ప్రెసిడెంటుకు అమ్మడానికి ఒప్పుకుంటాడు. ఆ నలభై సెంట్లే ప్రెసిడెంటుకు తక్కువయ్యాయని కాదు, అతని రెండు పొలాల మధ్య ఆ భూమివుంది. అందుకే దాన్ని కలిపేసుకోవాలనే తాపత్రయం. పేదవాడిని లొంగదీసుకోవటానికి బూర్జువాచట్టం సమ్మెటలాంటిసాధనం. దాన్ని పూటుగా వాడుకుంటాడు ప్రెసిడెంటు. ఆ సమ్మెటను మర్యాదగా ఎదుర్కోలేమనీ, తిరిగి దెబ్బతీయటానికి తనకు ఆ సమ్మెట పనికిరాదని, వేరే ఆయుధాలు కావాలనీ బోడి తెలుసుకొనే సరికి చాలాకాలం పడుతుంది. తన సహనం నశించే వరకు, ఆరోగ్యం చెడేవరకు, నెట్టబడిన తరువాతే ఆ విషయం అర్థమవుతుంది. (ఈ ఒక్క రచనలోనే నమకుంటాము రావి శాస్త్రి రాజ్యాంగయంత్రపు వర్గ స్వభావన్ని స్పష్టంగా చూపిస్తారు).

అందుకే "తలుపుగొళ్ళెం" లోని వృత్తి భిక్షగాడూ (పీలుమబట్టిదొంగా) అయిన పైడిరాజుకు చట్టమూ, కోర్టు అంతా భయంకరంగా కనిపిస్తాయి. జడ్జీలు దుక్కబలిసిన గుంటనక్కలలాగా, ప్లీడర్లు చరచర్లాడే త్రాచుల్లాగా, పోలీసులూ కోర్టు సిబ్బందీ పీడించడానికి యముడు పంపిన స్పెషల్ టైపు పిశాచాల్లాగా కనిపిస్తారు. న్యాయస్థానం ఎంత "ఉన్నత"మయినా దాని ఆవరణలో మంచిపూల చెట్లు నాటినా వాటికి విషపుష్పాలే పూస్తాయని, అక్కడ పచ్చటి పూలతీగలు పసరిక పాముల్లా వుంటాయని, అక్కడ మానస సరోవరం వుంచే అది మొసలి గొయ్యిగా కుంచించుకు పోతుందని, అక్కడ అమాయకపు చిలకల్ని పెంచితే అవి గద్దలగా ఎదుగుతాయని, అక్కడ ఎవరయినా నవ్వితే అది రాక్షస వృశ్చికాల తోకలతో నవ్వినట్లుంటుందే గాని మనుషుల నవ్వులాగా వుండదని, అనిపిస్తుంది(నిజానికి 'తలుపుగొళ్ళెం' లోని ఆ రెండు పేజీల కోర్టు వర్ణన చాలా అద్భుతమయినది).

ఏమనిపించినా పైడిరాజులాంటి వాళ్ళు చేయగల్గిందేమీలేదు. రాజ్యాంగ యంత్రపు ప్రధాన కర్తవ్యం శ్రామిక వర్గాన్ని అణచడమే గాని, అధో ప్రపంచాన్ని రెగ్యులేట్ చేయడం కాదు. అందుకే ఆ అధో ప్రపంచవాసులు రాజ్యాంగ యంత్రానికి వ్యతిరేకంగా పోరాటాలు చేయడంగాని, దాన్ని మార్చడంగాని, అసాధ్యం. అటువంటి కృత్రిమ పోరాటాల్ని చిత్రించక పోవడం రావి శాస్త్రిలో మెచ్చుకో దగ్గ లక్షణమే గాని, దుర్భరమైన ఈ జీవన పరిస్థితులను మార్చగల వర్గాల గురించి ఆయన రాయడం అలవర్చుకుంటే బాగుంటుంది. లంపెన్ వర్గాల జీవితాన్ని ఎంతవాస్తవికంగా చిత్రించినా అది వాస్తవికదృక్పథం అవుతుందేగాని విప్లవదృక్పథంకాదు.